



నల్లబల్లమీద లెక్క చేస్తున్న నరసింహానికి "టెలిగ్రాం సార్" అన్న కేక వినబడనేలేదు. ఏనాడూ ఒక పోస్టుకార్డు, ఒక పెళ్ళిపత్రికకూడా అయనకు రావడం చూడని విద్యార్థులు మాస్టారికి టెలిగ్రామేమిటని విస్తుపోయారు. ముందుబెంచీ కుర్రాడు వుండబట్టలేక 'మీకు టెలిగ్రాం మాస్టారూ!' అన్నాడు. నరసింహం ఆశ్చర్యంగా కవరు అందుకుని చింపి చదివాడు. రైల్వే ఆఫీసువాళ్ళు పంపిన టెలిగ్రాం అది. రెండురోజులక్రిందట గుణదలదగ్గర జరిగిన రైలుప్రమాదంలో గాయపడి విజయవాడ రైల్వే హాస్పిటల్లో చికిత్సపొందుతున్న ఒక స్త్రీదగ్గర దొరికిన వివరాల ఆధారంగా పంపిన టెలిగ్రాం అది. నరసింహం కాయితం బంట్రోతుకు తిరిగి యిస్తూ "యిది నాకు కాదు." అన్నాడు.

సంతకమన్నా పెట్టకుండా తీసుకుని చింపి, చదివి, నాది కాదంటారేమండీ! 'నరసింహం, లెక్కల టీచరు' అంటే మీరుతప్ప యీ వూళ్ళో యింకెవరూ లేరండీ: బెజవాడనుంచి యీ వూరికి సైకిలుమీద వచ్చాను. కాఫీ తాగడానికి యీ వూళ్ళో హోటలన్నా కనిపించలేదు. సంతకం పెట్టివ్వండి., నేను త్వరగా వెళ్ళాలి," అన్నాడు టెలిగ్రాం బంట్రోతు చిరాగ్గా. నరసింహం అతణ్ణి పంపించాడు. బోర్డుమీద లెక్క పూర్తి చెయ్యకుండానే కుర్చీలో కూలబడిపోయాడు.

నరసింహం ఆలుబిడ్డలకు దూరమై తాడేపల్లి జిల్లాపరిషత్తువారి స్కూల్లో ఉద్యోగానికి వచ్చి ఆరేళ్ళయింది. పాత బెజవాడ పొలిమేర దాటి ఏరుదాటి తాటితోపుఃగుండా ఒక కొండను చుట్టివెళ్తే వస్తుంది కొత్తూరు తాడేపల్లి. ఇప్పుడు షోగ్గా అందరూ కె. తాడేపల్లి అనంటున్నారు. ఏడాదికి నాలుగునెలలు ఏరు నిండితే ఆ వూళ్లోవాళ్ళకూ తక్కిన ప్రపంచానికీ సంబంధం వుండదు. యింటినీ, యిల్లాల్నీ వదిలి నిరాసక్తిగా జీవించే నరసింహం టెలిగ్రాం చూచాక మామూలు మనిషయ్యాడు. గంట కొట్టారు పిల్లలు లేచారు. నరసింహం లేచి హెడ్ మాస్టరు గదిలోకి వెళ్ళి రెండు రోజులు సెలవుపెట్టి యింటికైనా వెళ్ళకుండా కండువా దులిపి బుజాన వేసుకుని, గొడుగు విప్పి చేతబట్టుకుని బెజవాడకు నడక సాగించాడు. బస్సులూ, రైళ్ళూ వున్న వూరుకాదు కె. తాడేపల్లి!

దారిలో, గతించిన సంఘటనలు ఒకదానితర్వాత నొకటిగా గుర్తుకు వచ్చాయి నరసింహానికి. ఆరేళ్ళక్రిందట అతని కొడుకు సూర్యచంద్రరావు పి. యు. సి. పాసయ్యాడు. క్లాసు వచ్చింది. మెడిసిన్ చదువుతానని పట్టుబట్టాడు. 'క్లాసు వచ్చింది కనుక నీకు సీటు రావచ్చును. కాని నీకు ఏ స్కాలరుషిప్పో వచ్చేటంత ఘనమైన మార్కులు రాలేదు. నిన్ను పొరుగూరు పంపి ప్రొఫెషనల్‌కోర్సులో చేర్పించి భరించగల శక్తి నాకు లేదు. యీ వూళ్ళోనే బి. యస్సి. లో చేరు.' అన్నాడు నరసింహం కొడుకుతో. అప్పటికే మెట్రిక్ చదువుతూన్న కూతురి పెళ్ళికోసం బెంగ పడుతున్నాడు నరసింహం. కొడుకు మంకుపట్టు పట్టాడు. 'పైకి వచ్చే పిల్లాణ్ణి చేతులారా అణగద్రొక్కుతున్నారు మీరు.' అంటూ నిష్ఠూరమాడింది నరసింహం భార్య కామాక్షి. నరసింహానికి చిరాకువేసింది. 'రేపు నీ కూతురు కాలేజిలో చదువుతానంటుంది; చేర్పిస్తావా? చదివిన పిల్లకదాని కట్నం ఒక రూపాయి తగ్గించే పెళ్ళికొడుకు ఎవడైనా దొరుకుతాడా? వున్న కొంప్ర కాస్తా కొడుకు చదువుకు అమ్మివేస్తే, వాడు సంపాదించి చెల్లెలి పెళ్ళి చేస్తాడని ఎదురు చూస్తావా? ఎన్నాళ్ళని భరిస్తాం బాధ్యతల బరువును? మన శక్తి మేరకు కొడుకును చదివిస్తాం, కూతురికి పెళ్ళి చేస్తాం. పిల్లలు కొండెత్తుకోరికలు కోరితే మనం తీర్చితీరాలని చట్టంలేదు కామాక్షీ!' అని నయాన బోధించాడు భార్యకు నరసింహం. కొడుకు అన్నం మానేసి అలిగాడు. ఒకరాత్రి ఎవరో స్నేహితునింట్లో వుండిపోయాడు. కామాక్షి తన నగలమ్మి కొడుకును మెడికల్‌కాలేజీకి పంపిస్తానని బెదిరించింది భర్తను. నరసిహం ఆమె వంక తిరస్కారంగా చూశాడు. తన

యని కోరికకు కదిలిపోయిన తల్లి నిజంగానే నగ లమ్మింది. సూర్యం గుంటూరు మెడికల్ కాలేజీలో చేరాడు. నరసింహం ఎవరినీ ఏమీ అనలేదు. కాని నెల తిరిగేటప్పటికల్లా యిల్లువిడిచి వెళ్ళిపోయాడు. వెళ్ళిన వారానికి ఉత్తరం వ్రాశాడు భార్యకు. "ప్రతి మగవాడూ తన యింటికి తను మహారాజే! రాజులంతా నిరంకుశులు కానట్టే మగవాళ్ళూ కారు. గృహస్థులకు గౌరవభంగం కలిగిన సంసారంలో అరాజకం కాకతప్పదు. పిల్లల భవిష్యత్తు గురించికూడ నా సలహాలను పెడచెవిని పెట్టగల పెద్దదానివయ్యావు నువ్వు. నీకూ, నీ పిల్లలకూ నా అండదండ లక్కరలేదని తెలిసింది నాకు. నా కున్నది యకరం పొలం, ఒక యిల్లు. ఆ రెంటికి పవర్ ఆఫ్ ఎటార్నీ నీకు వ్రాసి పంపుతున్నాను. ఇహ మీ యిష్టం. మీ కష్టసుఖాలు యిహనుంచి మీవేకాని నావికావు." అని వ్రాశాడు. తర్వాత నెలనెలా జీతం తీసుకున్ననాడే వందరూపాయలు భార్యపేర యం. ఓ. చేసేవాడు. భార్యను వదిలినా బాధ్యతను వదలలే దతడు. ఆరేళ్ళు జరిగింది — 'యివాళ ఏమిటీ టెలిగ్రాం? ఎవ రాస్త్రీ?' అనుకున్నాడు నరసింహం.

సాయంత్రానికి రైల్వే హాస్పిటలు చేరిన నరసింహం, ఒకచెయ్యి కోల్పోయి మంచంమీద పడివున్న భార్యను చూసి ఆశ్చర్యపోయాడు. అతని కళ్ళు నీళ్ళు కురిశాయి. కామాక్షి స్పృహలోనే లేదు. రైల్వే అధికారులు అప్పగించిన ఆమె పెట్టె తెరిచి చూశాడు. రెండేరెండు చీరలూ, పదేళ్ళనాడు కుటుంబమంతా కలిసి తీయించుకున్న ఫోటో, మనియార్డరు కూపన్లకట్టా కనిపించాయి. చిరునామా తప్ప సంగతులూ, సంతకాలూ లేని యం. ఓ. కూపన్లు నరసింహాన్ని వెక్కిరించాయి. కామాక్షికి మూడవరోజు స్పృహ వచ్చింది. కళ్ళు తెరవగానే భర్త కనిపించాడు.

"వెతుక్కుంటూ వెళ్తే నన్ను రానిస్తారో వెళ్ళగొడ్తారో నని బెంగపడిపోయాను. యీ రైలుప్రమాదం ఎంత మంచిది! నన్ను వెతుక్కుంటూ మీరే వచ్చారు!" అన్నది కామాక్షి. నరసింహానికి ఆశ్చర్య మయింది. భార్య తనకోసం రావడ మేమి టనుకున్నాడు. జాలిగా చూస్తూ "నాకోసం నీ చేతినే బలిపెట్టుకున్నావు. నిన్నెట్లా కాదంటాను కామాక్షీ!" అన్నాడు. కామాక్షి సంతోషంగా నవ్వి "కొండంత మీరు దొరికాక కుడిచెయ్యి పోయినా పరవాలేదు," అంది. తప్పు చేసినవాడికి శిక్ష అనుభవించిన హాయి ఆమెక్కూడా కలిగింది.

భార్యతో తిరిగివచ్చిన నరసింహాన్ని చూచి వూరంతా విస్తుపోయారు. కామాక్షి బాగా లేచి తిరుగుతున్నది. తన పనులు తనే చేసుకుంటున్నది; కాని, యింట్లో ఏ పనికీ పనికిరావడంలే దామె. కుంపటి






"చూడండి మీరు కొన్నాళ్ళు బియ్యానికిబదులు గోధుమలు తింటం వుత్తమం."
"అలాగే! అవే యిప్పించండి."

రాజేస్తున్న భర్తను చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ "ఒకసారి మిమ్మల్ని సరకు చెయ్యనందుకు, ఎప్పటికీ మీకోసం పని చెయ్యగల సౌభాగ్యాన్ని నాకు లేకుండా చేశాడు దేవుడు! మీ సపర్యలు నేను పొందడంకన్నా నాకు శిక్షేముంది?" అంది.

నరసింహం — "అయితే కామాక్షీ! నేను అడగనూలేదు, నువ్వు చెప్పనూ లేదు. ఎందుకు నా దగ్గరకు ప్రయాణమయ్యావు చెప్పవూ?" అన్నాడు.

కామాక్షి పెల్లుబికివస్తున్న దుఃఖాన్ని బిగపట్టుకుంది. "మీరు వెళ్ళి వ్రాసినజాబు చదివాక, మీరు పంపిన డబ్బు తీసుకోకూడ దనుకున్నాను. కాని ఏ కొడుకు కోసం మిమ్మల్ని నొప్పించానో, వాడి కోసమే మీరు పంపిన డబ్బు తీసుకున్నాను. నెలనెలా మీరు పంపే వంద రూపాయలూ సూర్యానికి పంపించేదాన్ని. మూడునెల లయ్యాక వాడు విసుక్కుంటూ, 'వంద రూపాయలతో ఏం చదవమంటావు నన్ను? యిది మెడికల్ కాలే జనుకున్నావా? ఎలిమెంటరీస్కూ లనుకున్నావా?' అంటూ వ్రాశాడు. చేసేది

లేక యకరం పొలం బేరం పెట్టి, డబ్బు సూర్యంపేర బ్యాంకులో వేశాను. ఎక్కడా తప్పకుండా చదువుతున్న సూర్యాన్ని చూసి సంతోషించేదాన్ని. సరోజ కాలేజీలో చేరింది. మీరు పంపే వంద చాలక, యింట్లో రెండు గదుల్లో మే ముండి, తక్కినదంతా అద్దె కిచ్చాను. సూర్యం మూడవ సంవత్సరం చదువుతుండగా సెలవలకు వచ్చినప్పుడు, తన క్లాసుమేటును వర్ణాంతర వివాహం చేసుకుంటానని చెప్పాడు. నేను తెల్లబోయాను. 'యిప్పుడు నీకీ పెళ్ళేమిటిరా! నీ చెల్లెలికు పెళ్ళి ఎట్లా అవుతుంది? చదువు పూర్తయి వుద్యోగం చేసి ఒక అయిదేళ్లు కాస్త వెనుక వేసి సరోజ పెళ్ళి అయిందనిపించి తర్వాత నీ యిష్టం వచ్చినట్లు చేసుకుందువుగాని!' అన్నాను వాడితో. సూర్యం – 'బ్యాంకులో డబ్బు అయిపోయింది. శాంతావాళ్ల నాన్నకు బోలెడు డబ్బుంది. పెళ్లయితే నా చదువుఖర్చు వాళ్ళే భరిస్తారు. చదువు కానీ, తర్వాత మే మిద్దరం సంపాదన మొదలుపెడితే సరోజ పెళ్లి మూడేళ్ళలో చేసిపారేస్తాం.' అన్నాడు. ఏమీ చెయ్యలేకపోయాను నేను. సూర్యం పెళ్ళయింది. అత్తవారింట్లోనే వుండి చదువుకున్నాడు. పండుగ సెలవలక్కూడా యింటికి వచ్చేవాడు కాదు. యింతలో సరోజ ఎవరో అబ్బాయితోటి బాగా షికార్లు చేస్తున్నదని విని చివాట్లు వేశాను. అది ముఖం ఎరుపు చేసుకుని 'నా యిష్టం; గంగలో దిగుతాను; చేతిలో కానీ లేకుండా నువ్వు నాకు పెళ్ళి చెయ్యగలవా? అన్నయ్య కులం బయట పెండ్లాడితే, నాకు కులంలో పెళ్లికొడుకు దొరుకుతాడా?' అంటూ వాదించింది. ఏడాది తిరక్కుండా. "ప్రేమించినవాడు మోసం చేశా డంటూ ఏడుపు సాగించింది. సూర్యాన్ని పిలిపించి సంగతంతా చెప్పాను. వాడు మూడురోజుల్లో మన ఊళ్ళోనే, యిద్దరు పిల్లలున్న రెండో సంబంధం కుదిర్చాడు. నేను ఏడిస్తే, 'యింత ప్రతిష్ఠ సంపాదించిన కూతురికి పెళ్లంటూ అవుతోంది. అందుకు సంతోషించు.' అన్నాడు. సారె పెట్టలేని తల్లికి, పేరు చెరుపుకున్న కూతురు! నిజమే; అంతకన్నా మంచి పెళ్ళి ఎట్లా అవుతుంది? సరోజ పెళ్ళి అయిందనిపించారు. పెళ్లిఖర్చుకు ఇల్లు అమ్మేశాం. సూర్యం వెళ్ళిపోతూ 'ఇద్దరు పిల్లల్తో వేరే ఆడదక్షత లేకుండా సరోజ కొత్త సంసారం ఎట్లా చూసుకుంటుంది. నువ్వు దానిదగ్గరే వుండు కొన్నాళ్ళు. నేను నీకు డబ్బు పంపిస్తుంటానులే.'' అన్నాడు. నాకు నోట మాట రాలేదు. నవ్వి వూరుకున్నాను. నెలరోజులుకూడ వుండలేకపోయా నా నరకంలో! ఒకరోజు పెట్టె సర్దుకుని సూర్యం దగ్గరకు వెళ్దామని ప్రయాణ మయ్యాను. సరోజ అడ్డుచెప్పలేదు. నేను వాకిట్లోకి వచ్చేసరికి సూర్యం దగ్గరనుంచి మనియార్డరు వచ్చింది – ముప్పయి రూపాయిలు! తిరగకొట్టాను. సరోజ 'అదేమిటమ్మా,' అంది. 'వాడి దగ్గరకేగా వెళ్తున్నాను,' అన్నాను.








ఉన్నట్లుండి, ఇంద్రధనస్సుల్లాగా మురిపించిన రంగులన్నీ మాయమై, ఒక తెల్లని వెలుగే గోచరించింది నాకు. స్థిరమైన ఆ తేజస్సులో మీరుతప్ప అన్నీ లుప్తమైపోయాయి. బెజవాడకు టిక్కెట్టు కొనుక్కున్నాను. అన్నీ పోగొట్టుకున్న నన్ను నేను మీకు అర్పించుకుందామనుకున్నాను. మీరు స్వీకరిస్తారో లేదో ననే భయంకూడా లేకుండాపోయింది. దేవుడు నాకు తెలియదుకాని, అతడుకూడ మీ యంత దయామయుడు కాజాలడు. నాకు చెయ్యిపోతేనేం, మనసుమాత్రం గూడు చించుకుని రెక్కలు పరచుకున్న సీతాకోక చిలుకలాగ వుంది," అంది కామాక్షి. నరసింహం కళ్ళు తుడుచుకుని "లే, అంతా మర్చిపో. యిహ నాకు నువ్వూ, నీకు నేనూ వున్నాం; దిగులుపడకు," అన్నాడు. కామాక్షి కళ్ళల్లో వెన్నెల విరిసింది.